తెలంగాణ చౌరస్తా

తెలుగు దిన పత్రిక

epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

సంపుటి: 02
సంచిక:74

24 క్యారెట్లు 141,359.00 | కిలో వెండి 2,00,000.00 | chourastha Digitals | 14.11.2026 శనివారం, హైదరాబాద్



ఫోన్ ట్యాపింగ్ కేసులో బిగ్ ట్విస్ట్

- త్వరలో కీలక పరిణామాలు
- నా ఫోన్ ట్యాప్ చేసినా భయపడేది లేదు
- ఏది మాట్లాడినా బహిరంగమే
- మియాపూర్ భూముల వ్యవహారంలో బీఆర్ఎస్‌పై సీఎం విమర్శలు
- కవిత ఇంటిపై డ్రోన్ ఎగరేసింది ఎవరో తెలియదు
- కేటీఆర్ గడ్డంపై సీఎం రేవంత్ వ్యంగ్యాస్త్రాలు

తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో త్వరలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకోనున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసు దర్యాప్తులో రానున్న రోజుల్లో ఆసక్తికర పరిణామాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ఆయన వ్యాఖ్యలను బట్టి తెలుస్తోంది. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన ఇష్టాగోష్టిలో సీఎం పలు రాజకీయ, సమకాలీన అంశాలపై స్పందించారు.

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :

కేంద్ర ప్రభుత్వం తన ఫోన్‌ను ట్యాప్ చేసినా తనకు ఎలాంటి నష్టం లేదని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తాను మాట్లాడే విషయాలన్నీ బహిరంగంగానే ఉంటాయని, దాచాల్సిన అవసరం తనకు లేదని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో త్వరలోనే కీలక పరిణామాలు చోటుచేసుకుంటాయని స్పష్టం చేశారు. ఖేలో ఇండియా పోటీలకు

।మిగతా 2 లో।

తెలంగాణకు పెట్టుబడులే లక్ష్యం

భారత్ సమిట్‌తో గ్లోబల్ బ్రాండింగ్ సీఎం రేవంత్

2లో

- బీఆర్ఎస్, బీజేపీలపై ముఖ్యమంత్రి తీవ్ర విమర్శలు
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణే లక్ష్యం
- సమిట్ ప్రతినిధులు తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్లుగా మారుతారు






> తెలంగాణకు అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను ప్రపంచానికి పరిచయం చేయడమే భారత్ సమిట్ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సమిట్‌పై బీఆర్ఎస్, బీజేపీ నేతలు రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని గుడ్డిగా వ్యతిరేకించడం విపక్షాలకు అలవాటుగా మారిందని విమర్శించారు.



భాగ్యనగరంలో భారత్ సమ్మిట్2026 షురూ

2లో

- తొలిరోజు నాలుగు కీలక అంశాలపై చర్చ!
- తెలంగాణ అభివృద్ధి ప్రస్థానంపై అంతర్జాతీయ వేదికగా హైదరాబాద్
- పట్టణీకరణ, ఆర్థిక న్యాయం, సామాజిక న్యాయం, సంక్షేమంపై మేధోమథనం
- రెండోరోజు చర్చలకు హాజరుకానున్న రాహుల్‌గాంధీ



ఏసీబీ వలలో మరో అవినీతి అధికారి

- సోదాల్లో కళ్లు చెదిరే ఆస్తులు, ఆభరణాలు గుర్తింపు
- రూ.7.32 కోట్ల అక్రమాస్తులు గుర్తింపు
- ఏసీబీ వలలో ఇరిగేషన్ డీఈఈ
- నాగర్‌కర్నూల్ డీఈఈ సత్యనారాయణ నివాసంతో పాటు 10 ప్రాంతాల్లో సోదాలు
- 50 తులాల బంగారం, 2.8 కిలోల వెండి స్వాధీనం..
- ఐదు కార్లు, విల్లా, ఫ్లాట్లు, 25 ఎకరాల భూమి గుర్తింపు

నాగర్‌కర్నూల్, తెలంగాణ చౌరస్తా:

తెలంగాణలో అవినీతి అధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా నాగర్‌కర్నూల్ జిల్లా నీటిపారుదల శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న రాగిరి సత్యనారాయణ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు రావడంతో ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. గురువారం ఆయన నివాసంతో పాటు

।మిగతా 2 లో।

పల్లెలకూ పాకిన గంజాయి మత్తు

- యువత భవిష్యత్తు ఛిద్రం
- నగరాలకే పరిమితమైన మాదకద్రవ్యాల వ్యాపారం గ్రామాలకూ విస్తరణ
- అశ్వారావుపేట, దమ్మపేటలో పెరుగుతున్న కేసులు
- ఈజీ మనీ కోసం విక్రేతలుగా మారుతున్న విద్యార్థులు
- పోలీసులకు సవాల్‌గా మారిన గంజాయి నెట్‌వర్క్

2లో





ఫోన్ ట్యాపింగ్ నిజమే

- నా ఫోన్ కూడా ట్యాప్ చేశారు
- పెగాసస్ జాబితాలో నా పేరు కూడా..
- రాహుల్‌గాంధీ ఆరోపణలపై స్పందన..
- దేశంలో కొంతకాలంగా ఫోన్లపై నిఘా కొనసాగుతోంది
- ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్

న్యూఢిల్లీ, తెలంగాణ చౌరస్తా:

భారత్‌లో ఫోన్ ట్యాపింగ్ జరుగుతోందనేది కాదనలేని వాస్తవమని జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు, ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ వ్యాఖ్యానించారు. కొన్నేళ్ల క్రితం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పెగాసస్ నిఘా వివాదం సమయంలో తన ఫోన్ కూడా ట్యాపింగ్‌కు గురైనట్లు వెల్లడించారు.
ప్రధాని నరేంద్ర మోదీ

।మిగతా 3 లో।

పుట్టల వద్ద పూజల సందడి

- రాష్ట్రవ్యాప్తంగా నాగుల చవితి శోభ
- నాగేంద్రుడికి భక్తుల నీరాజనం
- పుట్టల్లో పాలు పోసి ప్రత్యేక పూజలు
- భక్తిపారవశ్యంలో తెలంగాణ..
- ఘనంగా నాగుల చవితి వేడుకలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు..
- తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు
- పుట్టలో పాలు పోసి, పసుపు కుంకుమలతో నాగేంద్రుడికి మొక్కులు
- శివాలయాలు, నాగులమ్మ ఆలయాల్లో భక్తుల సందడి



తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :

నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు తరలివచ్చి నాగేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టల్లో పాలు పోసి, పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శివాలయాలు, నాగులమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కుటుంబ సమేతంగా ఆలయాలకు చేరుకున్న భక్తులు తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, సంతానం, ఆయురారోగ్యాలు కలగాలని

।మిగతా 2 లో।

ఐకేపీ కేంద్రాల జాడేది..?

- దళారుల చేతిలో దగా పడుతున్న రైతన్న
- కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాక అన్నదాతల ఎదురుచూపులు
- ఐదు రోజులైనా పట్టించుకోని ఐకేపీ సిబ్బంది
- క్వింటాల్‌కు రూ.600 వరకు నష్టపోతున్న రైతులు
- వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

2లో



భాగ్యనగరంలో భారత్ సమ్మిట్-2026 షురూ

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :

హైదరాబాద్ వేదికగా నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్ 2026 తొలిరోజు కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రపంచ రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిణామాలపై చర్చించడంతోపాటు తెలంగాణ అభివృద్ధి ప్రస్థానాన్ని అంతర్జాతీయ ప్రతినిధులకు పరిచయం చేయడమే లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా 'థోర్జింగ్ ఏ న్యూ వరల్డ్' ఇతివృత్తంతో జరుగుతున్న ఈ సమ్మిట్‌లో తొలిరోజు 'తెలంగాణ రైజింగ్' పేరుతో నాలుగు కీలక అంశాలపై ప్యానల్ చర్చలు నిర్వహించారు.

నాలుగు అంశాలపై కీలక చర్చలు

తొలిరోజు పట్టణీకరణ, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, ఆర్థిక న్యాయం, సామాజిక న్యాయం, సంక్షేమ విధానాలపై ప్రముఖులు, నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. పట్టణీకరణ, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన, ఫ్యూచర్ సిటీ ప్రణాళికలపై జరిగిన చర్చలో పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

ఆర్థిక న్యాయం అంశంపై జరిగిన ప్యానల్ చర్చలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఆర్థిక అసమానతలను తగ్గించడం, అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకు చేరడం, సమాన అవకాశాల కల్పన వంటి అంశాలపై చర్చించారు.

సామాజిక న్యాయంపై జరిగిన చర్చలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని, వెనుకబడిన వర్గాలకు అవకాశాలు కల్పించడం, సామాజిక సమానత్వం సాధించాల్సిన అవసరంపై అభిప్రాయాలు వెల్లడించారు. మరోవైపు సంక్షేమంపై జరిగిన ప్యానల్ చర్చలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతికి అమలవుతున్న సంక్షేమ పథకాలు, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై చర్చించారు.

ప్రపంచ సమస్యలపై అంతర్జాతీయ మేధోమథనం

'థోర్జింగ్ ఏ న్యూ వరల్డ్' ఇతివృత్తంతో జరుగుతున్న రెండో ఎడిషన్ భారత్ సమ్మిట్‌లో ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న రాజకీయ, ఆర్థిక పరిణామాలు, ప్రజాస్వామ్య పరిరక్షణ, అంతర్జాతీయ సహకారం, కృత్రిమ మేధ (ఏఐ), వాతావరణ మార్పులు వంటి అంశాలు ప్రధాన చర్చనీయాంశాలుగా ఉన్నాయి. వివిధ దేశాలకు చెందిన రాజకీయ పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రధానులు, మాజీ మంత్రులు, గవర్నర్లు, ఎంపీలు, రాయబారులు, విధాన నిర్ణేతలు, మేధావులు, సామాజికవేత్తలు ఈ వేదికపై తమ అనుభవాలను పంచుకుంటున్నారు.

రెండోరోజు నాలుగు అంశాలపై చర్చలు

సమ్మిట్ రెండోరోజు కార్యక్రమాల్లో భాగంగా మరో నాలుగు కీలక అంశాలపై చర్చలు జరగనున్నాయి. సహకార సమాఖ్యవాదం, సంస్కృతిసమాజం, యువతక్రీడలురాజకీయాలు, ఎన్నికల సమగ్రత వంటి అంశాలు చర్చకు రానున్నాయి. ఈ అంశాలపై అంతర్జాతీయ ప్రతినిధులు తమ అభిప్రాయాలు, అనుభవాలను వెల్లడించనున్నారు.

రాహుల్‌గాంధీ రాకపై ఆసక్తి

రెండోరోజు కార్యక్రమాలకు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతోపాటు పలువురు మంత్రులు, ఇతర ప్రముఖులు కూడా పాల్గొననున్నారు. కాగా, వివిధ దేశాల నుంచి హాజరుకావాల్సిన ప్రతినిధుల్లో కొందరు చివరి నిమిషంలో రాలేకపోవడంతో నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం.

ఫోన్ ట్యాపింగ్ కేసులో బిగ్ ట్విస్ట్


తరువాయి భాగం

ఆహ్వానించేందుకే ఎల్లుండి ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశం కానున్నట్లు రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఈ భేటీకి ఇతర రాజకీయ ప్రాధాన్యతలు ఆపాదించాల్సిన అవసరం లేదని వివరించారు. మియాపూర్ భూముల వేలాన్ని అడ్డుకుంటామంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న హెచ్చరికల వెనుక డబ్బులు వసూలు చేయాలనే ఉద్దేశం ఉందని సీఎం ఆరోపించారు. గతంలో ఉద్యమ సమయంలో ల్యాంకోహిల్స్, పద్మాలయ భూముల విషయంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేసిన నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. అప్పట్లో ఆ భూముల అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకున్నారని విమర్శించారు. కవిత నివాసంపై డ్రోన్ ఎగరేసిన ఘటనపై స్పందిస్తూ.. ఆ డ్రోన్‌ను ఎవరు ఎగరేశారో తనకు తెలియదని రేవంత్‌రెడ్డి అన్నారు. కవిత కుటుంబంలో జరుగుతున్న అంతర్గత వివాదాల్లోనే ఏదైనా జరిగి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. ఆ వ్యవహారాన్ని వారే తేల్చుకుంటారని వ్యాఖ్యానించారు. భారత్ సమిట్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఆహ్వానించకపోవడంపై సీఎం వివరణ ఇచ్చారు. ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్ కర్టెన్ రైజర్' కార్యక్రమానికి కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను ఆహ్వానించినప్పటికీ వారు హాజరుకాలేదని తెలిపారు. అందుకే భారత్ సమిట్‌కు ఆహ్వానించలేదని స్పష్టం చేశారు. కిషన్‌రెడ్డి వస్తానంటే తానే స్వయంగా వెళ్లి ఆహ్వానిస్తానని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గడ్డం పెంచడంపై సీఎం వ్యంగ్యంగా స్పందించారు. కేటీఆర్ గడ్డం పెంచితే అది ఆయన మోకాళ్ల వరకే వస్తుందని, తనకేమీ ఇబ్బంది ఉండదని ఎద్దేవా చేశారు. భారతీయుల ఆత్మ కాంగ్రెస్ పార్టీ అని వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్యానికి ముందు బీజేపీ లేదని, మరో 25 ఏళ్ల తర్వాత ఆ పార్టీ ఉనికి ఉండదంటూ రాజకీయ వ్యాఖ్యలు చేశారు. మీడియా చిట్‌చాట్‌లో సీఎం చేసిన ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ కేసులో త్వరలో అనూహ్య పరిణామాలు ఉంటాయన్న వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

ఐకేపీ కేంద్రాల జాడేది..?

తెలంగాణ చౌరస్తా.స్టేట్ బ్యూరో :



ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. పంట చేతికొచ్చినా కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో దళారులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వ మద్దతు ధర అందక తక్కువ ధరకే ధాన్యం విక్రయిస్తూ అన్నదాతలు నష్టపోతున్నారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరం గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శనిగరం గ్రామంలో ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి ఐదు రోజులు గడుస్తున్నా కొనుగోళ్లు ప్రారంభం కాలేదని రైతులు వాపోతున్నారు. కేంద్రాల నిర్వాహకులు, సంబంధిత సిబ్బంది తమ వద్దకు వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తామని భరోసా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ధాన్యం రోజుల తరబడి కల్లాల్లోనే ఉండటంతో వర్షాలు, ఇతర పరిస్థితుల వల్ల నష్టం వాటిల్లుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. తప్పనిసరి పరిస్థితుల్లో కొందరు రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారుప్రభుత్వం వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,460 మద్దతు ధర ప్రకటించింది. దీనికి అదనంగా రూ.500 బోనస్ కలిపితే సాధారణంగా రైతుకు క్వింటాల్‌కు రూ.2,960 వరకు లభించాల్సి ఉంటుంది. అయితే ఐకేపీ కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో దళారులు క్వింటాల్‌కు కేవలం రూ.2,300 నుంచి రూ.2,350 వరకే చెల్లిస్తూ ధాన్యం కొనుగోలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. దీంతో మద్దతు ధరతో పోలిస్తే క్వింటాల్‌కు రూ.610 నుంచి రూ.660 వరకు నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతల సీజన్ ప్రారంభంలో ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ఆసక్తి చూపారని, ప్రస్తుతం పంట చేతికొచ్చిన సమయంలో కొనుగోళ్లకు ముందుకు రావడం లేదని రైతులు చెబుతున్నారు. ఐకేపీ కేంద్రాలు సకాలంలో ప్రారంభమైతే దళారుల బెడద తప్పడంతో పాటు ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందని పేర్కొంటున్నారు. ఐకేపీ కేంద్రాల నిర్వాహకులు వెంటనే స్పందించి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని శనిగరం రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దళారుల దోపిడీ నుంచి రైతులను కాపాడాలని, ప్రకటించిన మద్దతు ధరతో పాటు బోనస్ అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పంట పండించిన రైతుకు గిట్టుబాటు ధర దక్కేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏసీబీ వలలో మరో అవినీతి అధికారి

తరువాయి భాగం

బంధువులు, సన్నిహితులు, అనుమానిత బినామీలకు సంబంధించిన మొత్తం 10 ప్రాంతాల్లో ఏక కాలంలో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ.7.32 కోట్లకు పైగా విలువైన ఆస్తులను గుర్తించారు.

విల్లా, ప్లాట్లు.. 25 ఎకరాల వ్యవసాయ భూమి

ఏసీబీ సోదాల్లో భారీగా స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలు బయటపడ్డాయి. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో 342 గజాల స్థలంలో నిర్మించిన 5,200 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ట్రిప్లెక్స్ విల్లాను గుర్తించారు. హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్ గేటెడ్ కమ్యూనిటీలో 3 బీహెచ్‌కే ఫ్లాట్, నాగోల్ రాక్‌టౌన్‌లో 2 బీహెచ్‌కే ఫ్లాట్ ఉన్నట్లు గుర్తించారు.వనపర్తి జిల్లా షాపూర్ గ్రామంలో 25 ఎకరాల వ్యవసాయ భూమితో పాటు అందులో నిర్మించిన ఫాంహౌస్, నాగర్‌కర్నూల్ పట్టణ పరిధిలోని 9 ఓపెన్ ప్లాట్లకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. వీటన్నింటి ప్రభుత్వ విలువ రూ.7,32,66,581గా అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. బహిరంగ మార్కెట్లో వీటి విలువ మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

50 తులాల బంగారం.. ఐదు కార్లు

సోదాల్లో ఆభరణాలు, వాహనాలు కూడా బయట పడ్డాయి. సత్యనారాయణ నివాసంలో సుమారు 50 తులాల బంగారు ఆభరణాలు, 2.8 కిలోల వెండి వస్తువులను అధికారులు గుర్తించారు. మహీంద్రా XUV 7XO, TUV 300, బొలెరో, మారుతి సెలెరియో, హ్యుందాయ్ శాంత్రో సహా మొత్తం ఐదు కార్లను గుర్తించి సంబంధిత వివరాలను నమోదు చేశారు.

అవినీతి నిరోధక చట్టం కింద కేసు

డీఈఈ సత్యనారాయణపై అవినీతి నిరోధక చట్టం 1988లోని సెక్షన్ 13(1)(b), 13(2) కింద ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. గుర్తించిన ఆస్తులకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ చేపట్టారు. ఆయనకు సంబంధించిన బ్యాంకు లాకర్లు, ఆర్థిక లావాదేవీలు, బినామీ పేర్లతో ఉన్నట్లు అనుమానిస్తున్న ఇతర ఆస్తులపై కూడా దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.

పుట్టల వద్ద పూజల సందడి

తరువాయి భాగం

ప్రార్థించారు.

ఊకల్లులో నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు

వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ఊకల్లులోని శ్రీ నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారు జాము నుంచే మహిళలు ఆలయానికి చేరుకుని నాగేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 41 రోజులుగా స్వామివారి దీక్షలో ఉన్న భక్తులు కావళ్లతో ఆలయానికి చేరుకుని మాల విరమణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

పురాతన ఆలయంలో భక్తుల సందడి

జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లోని పురాతన శ్రీ స్వయంభు రామలింగేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వయంభువుగా వెలసిన రామలింగేశ్వర స్వామిని స్థానికులు ఇలవేల్పుగా కొలుస్తారు. ఆలయానికి ఉన్న పురాతన ప్రాశస్త్యంతో వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. నాగుల చవితి సందర్భంగా మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ముల్కనూర్‌లోని దేవి నాగేశ్వరి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం హైవే రహదారి పక్కనే ఉండటంతో సిద్ధిపేటహనుమకొండ మార్గంలో ప్రయాణించే పలువురు భక్తులు కూడా ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు.

నాగేంద్రుడికి ప్రత్యేక నైవేద్యాలు

మహబూబాబాద్‌లోని గాయత్రీ దేవాలయంలో నాగుల చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు నాగేంద్ర స్వామికి పసుపు, కుంకుమ, పంచామృతాలు సమర్పించి ప్రత్యేక నైవేద్యాలు పెట్టారు. ఆలయానికి వచ్చిన భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

పల్లెలకూ పాకిన గంజాయి మత్తు

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :



గంజాయి మత్తు యువత భవిష్యత్తును చిద్రం చేస్తోంది. ఒకప్పుడు నగరాలు, పట్టణాలకే పరిమితమైన మాదకద్రవ్యాల వినియోగం ఇప్పుడు క్రమంగా పల్లెలకూ విస్తరిస్తోంది. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో కొందరు యువకులు గంజాయి విక్రయాల వైపు అడుగులు వేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. మత్తుకు బానిసలవుతున్న యువత చదువు, ఉపాధి, కుటుంబ బాధ్యతలను పక్కనపెట్టి నేరాల బాట పడుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట, దమ్మపేట తదితర మండలాల్లో వెలుగుచూస్తున్న గంజాయి కేసులు పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి.

గంజాయి విక్రయాలు, వినియోగం మారుమూల గ్రామాలకు సైతం విస్తరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో కిరాణా దుకాణాల మాటున, ప్రధాన రహదారులు, కాలనీల పరిసరాల్లో మాదకద్రవ్యాల విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం. అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో గత రెండేళ్లుగా గంజాయి రవాణా, వినియోగానికి సంబంధించి పోలీసులు పెద్ద సంఖ్యలో కేసులు నమోదు చేశారు. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ యువత మత్తుకు ఆకర్షితులవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా పరిసర ప్రాంతాల్లో ఇటీవల చోటుచేసుకున్న పలు ఘటనలు గంజాయి అక్రమ రవాణా తీవ్రతను వెల్లడిస్తున్నాయి. దమ్మపేట మండలం చిల్లగుంపులో పోలీసులు ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సత్తుపల్లిలో వెలుగుచూసిన మరో కేసులో దాదాపు 80 మందిని అదుపులోకి తీసుకోగా, వారిలో ఎక్కువ మంది యువకులే ఉండటం గమనార్హం. గత జులైలో అచ్యుతాపురంలోని ఆయిల్‌పామ్ తోటలో 100 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. గత ఏడాది ఆగస్టులో విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న రెండు క్వింటాళ్ల గంజాయిని ఏపీతెలంగాణ సరిహద్దులో స్వాధీనం చేసుకున్నారు. మరో ఘటనలో విశాఖపట్నం అడవుల నుంచి తరలిస్తున్న సుమారు రూ.2 కోట్ల విలువైన గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. గతంలోనూ హైదరాబాద్‌కు తరలిస్తున్న గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని పలువురిని అరెస్టు చేశారు.

గంజాయి వినియోగం కంటే దాని సరఫరా వ్యవస్థను ఛేదించడం పోలీసులకు పెద్ద సవాల్‌గా మారుతోంది. త్వరగా డబ్బు సంపాదించాలనే ఆశతో కొందరు విద్యార్థులు, యువకులు విక్రయదారులుగా మారుతున్నట్లు తెలుస్తోంది. విద్యాసంస్థల్లో పనిచేసే కొందరు సిబ్బంది సైతం డబ్బు సంపాదించాలనే ప్రలోభానికి లోనై ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గంజాయి సరఫరా వెనుక ఉన్న ముఠాలను గుర్తించడం, వారి నెట్‌వర్క్‌ను ఛేదించడం పోలీసులకు కష్టతరంగా మారుతోంది. దీంతో అక్రమ విక్రయాలను గుర్తించేందుకు పోలీసులు డెకాయ్ ఆపరేషన్లు సైతం చేపడుతున్నారు.గంజాయి వినియోగం, రవాణా, విక్రయాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సోషల్ మీడియా వేదికగా తరచూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సీఐ నాగరాజు రెడ్డి తెలిపారు. గంజాయి సరఫరా లేదా వినియోగానికి సంబంధించి సమాచారం తెలిసినవారు వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేస్తామని వెల్లడించారు.మొత్తంగా గంజాయి మత్తు పల్లెలకు విస్తరిస్తుండటంతో యువత భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తమవుతోంది. మాదకద్రవ్యాల సరఫరా గొలుసును తెంచడంతో పాటు యువతలో అవగాహన పెంచడం, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, పోలీసులు సమన్వయంతో పనిచేయడం అత్యవసరంగా మారింది.

బాల్యం – భవితకు బంగారు బాటలు
నేటి బాలలే రేపటి భారత నిర్మాతలు!

పసిపాపల చిరునవ్వులో ప్రకృతి సౌందర్యం...
పసిహృదయాల స్పందనలో స్వచ్ఛమైన ప్రేమానురాగం... కల్మషమెరుగని మనసులు... కపటమెరుగని మాటలు... భేదభావాలు తెలియని భావాలు...
ద్వేషమెరుగని హృదయాలు... ఇదే కదా బాల్యం అంటే... దేవుడు భూమిపై రాసిన అందమైన కవిత్వం అంటే!
పిల్లల మనసులు తెల్లని కాగితాలు, మన ఆలోచనలు వాటిపై చెరగని అక్షరాలు.
మనం నేర్పే ప్రతి మాట ఒక పాఠమైతే, మనం చూపే ప్రతి ప్రవర్తన ఒక ఆదర్శం.
మనం నాటే ప్రతి మంచి ఆలోచన రేపటి వారి జీవితంలో మహావృక్షమై ఎదుగుతుంది!
అందుకే బాల్యం ఒక అమూల్యమైన వరం, పిల్లలు దేవుడిచ్చిన అపురూపమైన కానుకలు.
వారి నవ్వుల్లో వెయ్యి వసంతాల సౌందర్యం, వారి ఎదుగుదలలో దేశ భవిష్యత్తు వైభవం!
పిల్లలంటే అమితమైన ప్రేమ... పసిమనసులంటే అంతులేని మమకారం.. ఎక్కడ చిన్నారులు కనిపించినా ఆప్యాయంగా పలకరించి, వారితో మమేకమై, వారి నవ్వుల్లో తన ఆనందాన్ని వెతుక్కున్న మహోన్నత వ్యక్తిత్వం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూది!
ఆయన జన్మదినమైన నవంబర్ 14ను భారతదేశం బాలల దినోత్సవంగా జరుపుకుంటోంది. ఇది కేవలం ఒక వేడుక కాదు... బాల్యాన్ని ప్రేమించాలనే ఒక సందేశం

బాలల భవిష్యత్తును తీర్చిదిద్దాలనే ఒక సంకల్పం!

నేటి బాలలే రేపటి పౌరులు, నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలు, నేటి చిన్నారులే రేపటి నాయకులు, వారి చేతుల్లోనే భారతదేశ ప్రగతి రథచక్రాలు!
కానీ... నేటి సమాజం మనకు ఒక ప్రశ్న సంధిస్తోంది!

విద్య పెరుగుతోంది...

విజ్ఞానం విస్తరిస్తోంది... సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతోంది...కానీ ఎక్కడో మానవీయ విలువలు మసకబారుతున్నాయి.
పెద్దల పట్ల గౌరవం తగ్గుతోంది, మాటల్లో మర్యాద మాయమవుతోంది, ప్రవర్తనలో క్రమశిక్షణ కనుమరుగవుతోంది. మన సంస్కృతి, సంప్రదాయాలకు దూరమవుతూ విచ్చలవిడితనమే స్వేచ్ఛ అనుకునే ధోరణి యువతలో అక్కడక్కడా కనిపించడం ఆందోళనకరం!
మార్కులు సాధించడం మాత్రమే విద్య కాదు
మంచి మనిషిగా ఎదగడమే అసలైన విద్య!
పుస్తకాలు చదవడం మాత్రమే విజ్ఞానం కాదు, పరుల మనసును అర్థం చేసుకోవడమే నిజమైన సంస్కారం!
ఉన్నత పదవులు అధిరోహించడం మాత్రమే విజయం కాదు,

ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవడమే అసలైన గెలుపు!

అందుకే తల్లిదండ్రులారా... ఒక్కసారి ఆలోచించండి! పిల్లలకు ఆస్తులు కూడబెట్టడం కంటే మంచి అలవాట్లను వారసత్వంగా అందించండి. విలువైన బహుమతులు ఇవ్వడం కంటే విలువలతో కూడిన జీవితాన్ని నేర్పించండి. వారి కోరికలకు రెక్కలు ఇవ్వండి, వారి ప్రవర్తనకు క్రమశిక్షణ నేర్పండి, వారి స్వేచ్ఛకు బాధ్యతను జోడించండి!

గురువులారా... మీ బాధ్యత మరింత మహోన్నతమైనది!

మీ చేతిలోని చాక్‌పీస్‌తో అక్షరాలనే కాదు, వారి జీవితాలకు దిశానిర్దేశం చేయాలి. పాఠ్యాంశాలనే కాదు, మానవీయ విలువలనూ బోధించాలి. వారి మేధస్సుకు పదును పెట్టడమే కాదు, వారి హృదయాల్లో మానవత్వాన్ని నింపాలి. తప్పును సరిదిద్ది, ప్రతిభను ప్రోత్సహించి, ప్రతి విద్యార్థిలో ఒక గొప్ప వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించాలి!

ఎందుకంటే...

ఒక బాలుడిని తీర్చిదిద్దితే ఒక కుటుంబం వెలుగుతుంది, ఒక విద్యార్థిని సంస్కరిస్తే ఒక సమాజం మారుతుంది, ఒక తరాన్ని సన్మార్గంలో నడిపిస్తే ఒక దేశం తలెత్తుకుంటుంది!

బాల్యం వికసించాలి...

బాలల మేధస్సు ప్రకాశించాలి... వారి హృదయాల్లో మానవత్వం పరిమళించాలి...

వారి అడుగుల్లో దేశభక్తి ప్రతిధ్వనించాలి...

వారి ఆలోచనల్లో సమాజ శ్రేయస్సు తొణికిసలాడాలి...బాలల నవ్వులు దేశానికి అలంకారం కావాలి, బాలల విజ్ఞానం దేశానికి ఆయుధం కావాలి, బాలల సంస్కారం సమాజానికి ఆదర్శం కావాలి, బాలల ప్రతిభ భారతదేశానికి కీర్తి కిరీటం కావాలి!



నేటి బాలలే రేపటి భారత నిర్మాతలు!

రండి... ఈ బాలల దినోత్సవం సందర్భంగా పిల్లల చేతుల్లో కేవలం బొమ్మలు కాదు... భవిష్యత్తును అందిద్దాం!

వారి మెదళ్లలో కేవలం మార్కులు కాదు...

మానవీయ విలువలు నింపుదాం!
వారి కళ్లలో కేవలం కలలు కాదు...
ఆ కలలను నిజం చేసే ధైర్యాన్ని నింపుదాం!
ఎందుకంటే పిల్లలు మన ఇంటి సొత్తు మాత్రమే కాదు...

ఈ దేశపు అమూల్యమైన సంపద!

వారి భవిష్యత్తు మన బాధ్యత మాత్రమే కాదు...
భారతదేశ భవితవ్యానికి మనమిచ్చే భరోసా!!

-దేశిని శ్రీధర్ గౌడ్
ఎం.ఏ,ఎం.ఈడీ
ప్రిన్సిపల్,ఎస్.ఆర్ జూనియర్ కళాశాల





బాలలే దేశ భవిష్యత్ కు పునాది

- చిన్నకల్వల ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా స్వయం పాలన దినోత్సవం
- ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు.. ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్
- చిన్నకల్వల ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం పర్కాల ఎల్లయ్య

సుల్తానాబాద్, తెలంగాణ చౌరస్తా :

నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్తుకు బలమైన పునాది అని చిన్నకల్వల ప్రాథమికోన్నత ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పర్కాల ఎల్లయ్య అన్నారు. సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత ప్రభుత్వ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. పాఠశాల హెచ్ఎం ఎల్లయ్య ఆధ్వర్యంలో అధ్యాపకుల బృందం పర్యవేక్షణలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించి ఆకట్టుకున్నారు. విద్యార్థుల పర్యవేక్షణ కోసం హెచ్ఎంగా మామిడి రిషిత, ఏడవ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం విద్యార్థులందరూ ఎంతో సంబురంగా జరుపుకున్నారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ.. నేటి విద్యార్థులు రేపటి పౌరులని అన్నారు. విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించి, ఉత్తమ పౌరులుగా మారాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడంతో పాటుగా వారిలోని నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి కృషి చేస్తున్నామన్నారు. విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకర్షింపజేశాయి. తదనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులందరికీ బహుమతులు, స్వీట్లు ప్రధానోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు ఎం. సాయిలు, మహమ్మదీ బేగం, డిఎన్ హరిప్రియ, అసిస్టెంట్ టీచర్ గుర్రం మౌనిక, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలి

- డిసెంబర్ 12న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- హైదరాబాద్‌లో ఘనంగా టీఎన్‌జీఓస్ జిల్లా సర్వసభ్య సమావేశం.. చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్ తెలంగాణ చౌరస్తా:



తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ (TNGOs) కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. హుస్సేని (ముజీబ్) ఆదేశాల మేరకు హైదరాబాద్ జిల్లా టీఎన్‌జీఓస్ యూనియన్ కార్యాలయ ప్రాంగణంలో జిల్లా సర్వసభ్య సమావేశం ఘనంగా నిర్వహించారు.ఈ సమావేశానికి టీఎన్‌జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (TGEJAC) జిల్లా చైర్మన్ ఎస్. విక్రమ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (AISGEF) పిలుపు మేరకు 2026 డిసెంబర్ 12న నిర్వహించనున్న 'చలో ఢిల్లీ' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సంఘం నాయకులు ఆవిష్కరించారు.అనంతరం నూతన సంవత్సరం సందర్భంగా సంఘం డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ ఏర్పాట్లపై చర్చించారు. డిసెంబర్ 12న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు హైదరాబాద్ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులను సమాయత్తం చేయాలని తీర్మానించారు. త్వరలో జరగనున్న టీఎన్‌జీఓస్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో హైదరాబాద్ జిల్లా జట్టు పాల్గొనే అంశంపై సమీక్షించారు. సంఘం సభ్యత్వ నమోదు, సభ్యత్వ రుసుము వసూలు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు జిల్లా పరిధిలోని వివిధ ప్రభుత్వ శాఖల యూనిట్లలో పెండింగ్‌లో ఉన్న ఎన్నికలను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎస్. విక్రమ్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల హక్కుల సాధన కోసం కేంద్ర సంఘం ఇచ్చే ప్రతి పిలుపును హైదరాబాద్ జిల్లా యూనిట్ ముందుండి విజయవంతం చేస్తుందని తెలిపారు. డిసెంబర్ 12న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమంలో జిల్లా పరిధిలోని అన్ని యూనిట్ల నాయకులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో టీఎన్‌జీఓస్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కురాడి శ్రీనివాస్, కోశాధికారి జె. బాలరాజ్, అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్. రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు బి. శంకర్, ప్రచార కార్యదర్శి వైదిక్ శాస్త్ర, సంయుక్త కార్యదర్శి గీత, ఈసీ సభ్యులు ముఖీమ్ ఖురేషితో పాటు జిల్లా పరిధిలోని వివిధ యూనిట్ల అధ్యక్షులు, కార్యదర్శులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ

డాక్టర్ కావాలని నా కోరిక

బాలల దినోత్సవం సందర్భం ఉపాధ్యాయునిగా వ్యవహరించే అవకాశం ఇచ్చినందుకు మా ఉపాధ్యాయులకు ధన్యవాదాలు. నేను డాక్టర్ కావాలని నిర్ణయించుకున్నాను. అందుకోసమే ఇప్పటినుంచి నా తరగతికి సంబంధించిన పుస్తకాలను బాగా చదువుతున్నాను. మా టీచర్లు చక్కగా చెప్పడంతో పాటు అనేక మంచి విషయాలను మాకు బోధిస్తున్నారు. తరగతి పుస్తకాలు, మా పాఠశాల అంటే నాకెంతో ఇష్టం. ఉపాధ్యాయుల సూచనల, సలహాలను పాటిస్తూ ముందుకు వెళుతున్నాను. బాగా చదివి భవిష్యత్తులో డాక్టర్ నవుతా. ఉన్న ఊరికి, కన్నతల్లిదండ్రులకు, మా పాఠశాలకు, గురువులకు మంచి పేరు తీసుకువస్తాను.



గాజనవేన మనూహ్య, 4వ తరగతి

బాగా చదివి కలెక్టర్నవుతా

నేను బాగా చదువుకొని కలెక్టర్ ను అవుతాను. పెద్ద ఆఫీసర్ కావాలన్నదే నా ఆశయం. చిన్నప్పటి నుంచి బాగా చదివితేనే పెద్ద ఆఫీసర్ అవుతారని మా సార్లు చెప్పారు. అందుకని నేను అన్ని సబ్జెక్టులను బాగా చదువుతున్నాను. మా సార్లు చెప్పిన విషయాలను జాగ్రత్తగా వింటున్నాను. బాలల దినోత్సవం రోజున నేను ఒకటవ తరగతి, పూర్వ ప్రాథమిక పాఠశాల పిల్లలకు గణితం బోధించాను. ఒక్కరోజు ఉపాధ్యాయురాలిగా వ్యవహరించడం నాకు చాలా ఆనందంగా ఉంది. ఇది నాకు మర్చిపోలేని అనుభూతి.



మంద రిషిత, 3వ తరగతి

పెద్ద పోలీసాఫీసర్ నవుతా

పెద్ద పోలీసాఫీసర్ కావాలని ఉంది. పోలీసు వృత్తి అంటే నాకు ఇష్టం. సమాజంలో పోలీసుల పాత్ర చాలా కీలకమైనది. మా సార్లు చెప్పిన ప్రకారం బాగా చదువుకొని ఉన్నత స్థానంలో నిలవాలన్నదే నా కోరిక.



పాఠశాలలో సార్లు మాకు చాలా విషయాలు చెబుతూ మమ్మల్ని ఉత్తమంగా తీర్చిదిద్దుతున్నారు. బాలల దినోత్సవం సందర్భంగా నేను ఉపాధ్యాయుడిగా వ్యవహరించడం నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ అనుభవాన్ని నేను ఎప్పటికీ మర్చిపోలేను. పాఠశాలలో మా సార్లు అనేకమైన విజ్ఞాన సంబంధమైన విషయాలను తెలియజేస్తూ మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. పాఠశాలలో అనేక కార్యక్రమాల ద్వారా మాకు ఎంతో జ్ఞానాన్ని అందిస్తున్నారు.

పెండ్లి నితీష్, 5వ తరగతి

- ఊషన్నపల్లి పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

కాల్వ శ్రీరాంపూర్,తెలంగాణ చౌరస్తా:

ఎప్పుడూ ఉపాధ్యాయులు చెబుతుంటే పిల్లలు పాఠాలు వింటారు. కానీ ఇక్కడ పాఠశాల పిల్లలు ఉపాధ్యాయులుగా అవతారమెత్తారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వివిధ పాఠ్యాంశాలను బోధిస్తూ బిజీ బిజీగా ఉన్నారు. రోజు తమ సహచరులతో కలిసి ఉండే వీరు పాఠాలు బోధిస్తూ మిక్కిలి సంతోషపడ్డారు. వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. తాము ఉపాధ్యాయులుగా వ్యవరించడంతో గొప్ప అనుభూతికి లోనయ్యారు. ఆనందంతో గంతులు వేశారు.వివరాలకు వెళితే... కాల్వశ్రీరాంపూర్ మండలం ఊషన్నపల్లి ఆంగ్ల మాధ్యమ ప్రభుత్వ ప్రాథమిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య ఆధ్వర్యంలో ముందస్తుగా శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.విద్యార్థినీ,విద్యార్థులు ఉదయాన్నే అందంగా ముస్తాబై పాఠశాలకు చేరుకున్నారు. ఉపాధ్యాయుల వేషధారణలో వచ్చిన చిన్నారులు తమకు కేటాయించిన వివిధ సబ్జెక్టులను చక్కగా బోధించారు. ఒకరికి మించి ఒకరు పోటీపడి తమ సహచరులకు పలు విషయాలపట్ల అవగాహన కల్పించారు.వీరు బోధిస్తున్న పాఠ్యాంశాలను ఉపాధ్యాయులు నిషితంగా గమనించారు. తెలుగు ఇంగ్లీషు,గణితం,ఇతర సబ్జెక్టుల్లో ఉత్తమ బోధనా నైపుణ్యాలను ప్రదర్శించిన వారిని ఎంపిక చేసి, బహుమతులను అందజేశారు.ఉపాధ్యాయులైన విద్యార్థులను పాఠశాల టీచర్లు అభినందించి ,శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య, ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు అమృత సురేష్‌కుమార్,మంద శ్రీవాణి, ఎర్ర స్రవంతి,సరిత,పిల్లలు,పలువురు పాల్గొన్నారు.



ఫోన్ ట్యాపింగ్ నిజమే

తరువాయి భాగం

తన ఫోన్‌ను ట్యాప్ చేయిస్తున్నారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన ఆరోపణల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

శుక్రవారం మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ప్రశాంత్ కిశోర్ స్పందిస్తూ.. దేశంలో ఫోన్లు ట్యాప్ అవుతున్నాయని, ఇది కొంతకాలంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌కు చెందిన పెగాసస్ స్పైవేర్ ద్వారా నిఘా పెట్టినట్లు వార్తలు వచ్చినప్పుడు, లక్ష్యంగా చేసుకున్న వారి జాబితాలో తన పేరు కూడా ఉన్నట్లు తెలిసిందన్నారు. ఆ సమయంలో తాను ఎన్నికల వ్యూహకర్తగా పనిచేస్తున్నానని గుర్తుచేశారు.

ప్రధాని మోదీ తన ఫోన్‌ను ట్యాప్ చేయిస్తున్నారని రాహుల్‌గాంధీ ఇటీవల ఆరోపించారు. తన ఫోన్‌లోనే ప్రధానికి వ్యతిరేకంగా చేసిన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో నిర్వహించిన 'ఆస్క్ మీ' సెషన్‌లో ఈ అంశాన్ని ప్రస్తావించారు. పార్లమెంటులో చర్చించవచ్చని బీజేపీ చెబుతున్నప్పటికీ, తాను బహిరంగ చర్చకు ఎందుకు పట్టుబడుతున్నానో వివరించారు. సభలో తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని, మైక్రోఫోన్ కూడా ఆఫ్ చేస్తున్నారని ఆరోపించారు.

రాహుల్ వ్యాఖ్యలకు సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్‌తో పాటు ఇండియా కూటమిలోని పలువురు నేతలు మద్దతు తెలిపారు. మరోవైపు బీజేపీ నేతలు ఈ ఆరోపణలను ఖండించారు. బీజేపీ కేరళ విభాగం అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ రాహుల్ వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు చేశారు. ఇటీవల బీజేపీ సీనియర్ నేత రవీంద్ర కిశోర్ సిన్హా శ్రాద్ధ కర్మల సందర్భంగా బిహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరీతో ప్రశాంత్ కిశోర్ భేటీ కావడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. గతంలో సామ్రాట్ చౌదరీపై విమర్శలు చేసిన ఆయన ఇప్పుడు కలవడంపై మీడియా ప్రశ్నించింది. దీనికి స్పందిస్తూ.. ఒక ఎమ్మెల్యేగా నియోజకవర్గ సమస్యలపై చర్చించేందుకు ముఖ్యమంత్రిని కలవడం సహజమని చెప్పారు. అంత్యక్రియలు, శ్రాద్ధ కార్యక్రమాల వంటి సందర్భాల్లో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం మన సంస్కృతిలో భాగమని వివరించారు. రాజకీయ విభేదాలను వ్యక్తిగత వైరుధ్యాలుగా చూడకూడదని స్పష్టం చేశారు.

బిహార్‌లో ప్రధాని మోదీ ప్రారంభించనున్న పంతెనకు మాజీ సీఎం నితీశ్ కుమార్ పేరు పెట్టడంపై కూడా ప్రశాంత్ కిశోర్ స్పందించారు. ప్రాజెక్టులకు ఎవరి పేరు పెట్టారన్న దానికంటే ప్రజలకు కలిగే ప్రయోజనమే ముఖ్యమని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో రోడ్లు, వంతెనలు, రైల్వే ప్రాజెక్టుల అభివృద్ధితో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపైనా ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. బిహార్‌లో బీజేపీ అధికారంలో ఉన్నందున ఉద్యోగాల కల్పనకు ప్రధాని ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.







భక్తి శ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు

"విశిష్టత,ఆధ్యాత్మిక ప్రాముఖ్యత,ఆచారాలు హిందూ సంస్కృతిలో ప్రకృతిని,సమస్త జీవరాశులను దైవ స్వరూపంగా ఆరాధించడం అనాదిగా వస్తున్న మన సంప్రదాయం.."


ఈ కోవలో కార్తీక మాసంలో శుక్ల పక్ష చవితి నాడు జరుపుకునే నాగుల చవితి అత్యంత విశిష్టమైన పండుగ.సంతాన ప్రాప్తి,కుటుంబ క్షేమం,కాలసర్ప దోష నివారణ కోసం భక్తులు ఈ రోజున నాగదేవతలను అత్యంత భక్తిశ్రద్ధలతో పూజిస్తారు.ప్రతీ గ్రామంలోనూ నాగేంద్రుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.నాగ దేవతకు భక్తులు ప్రత్యేకంగా నైవేద్యం సమర్పిస్తారు.

నాగుల చవితి ఆధ్యాత్మిక విశిష్టత

నాగారాధన వెనుక పరమార్థం,పరమశివుడి కంఠాభరణంగా,శ్రీమహావిష్ణువు శేషతల్పంగా సర్వ రాజుకు సనాతన ధర్మంలో విశిష్ట స్థానం ఉంది. భూమిని తన పడగపై మోసే ఆదిశేషుడికి కృతజ్ఞత తెలుపుతూ ఈ పండుగను జరుపుకుంటారు.

దేవాలయాల్లో నాగుల చవితి సందడి...

దీపావళి తర్వాత వచ్చే అత్యంత పవిత్రమైన పండుగ నాగుల చవితి.ఈ పండుగను గ్రామాలు,పట్టణాలు,నగరాల్లో ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.వాడవాడలా ప్రజలు ఉదయం నుంచి నాగేంద్రుడి పూజల్లో మునిగిపోయారు.నాగుల చవితి రోజు నాగదేవతను పూజిస్తే సమస్త పాపాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.ఎక్కుడున్నా నాగుల చవితి రోజు ఇంటికి వచ్చి కుటుంబసభ్యులతో కలిసి నాగదేవతకు పూజలు చేయడం తరతరాలుగా వస్తోంది.దీనివల్ల నాగేంద్రుడి చల్లని ఆశీస్సులు కుటుంబంపై పడి శుభం కలుగుతుందని భక్తుల నమ్మకం.ఆ నమ్మకంతో వేకువజాము నుంచి భక్తులు పల్లెలు,పొలాలు,తోటలు,ఖాళీ ప్రదేశాల్లో వున్న పుట్టల వద్దకు తండోప తండాలుగా



తరలివస్తుంటారు.నాగ దేవతకు భక్తులు సంప్రదాయబద్ధంగా దీపారాధన చేసి,నైవేద్యం సమర్పిస్తారు.పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకోవడం ఈ పండగలో అత్యంత కీలకమైనది. పాలతోపాటు, గుడ్లు,చలివిడి,తెగ,బుర్రగుంజు వంటి పుట్టలో వేసి నాగరాజుకు భక్తులు పూజలు చేస్తారు.తమ కుటుంబం ఆయురారోగ్యాలు,సుఖ శాంతులు ప్రసాదించాలని వేడుకున్నారు.అనేక మంది మహిళలు పుట్ట చుట్టూ ప్రదక్షిణలు చేసి తమ కోరికలు నెరవేర్చమని మొక్కుకుంటారు.

నాగేంద్రుడికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు


నాగుల చవితి సందర్భంగా దేశంలోని అన్ని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేస్తుంటారు.హిందూ సనాతన ధర్మంలో నాగ దేవతల ఆరాధనకు ప్రత్యేకమైన స్థానం ఉంది.పురాణాల ప్రకారం నాగ దేవతలకు దైవిక శక్తి ఉందని భక్తులు నమ్ముతారు.క్షీరసాగర మథన సమయంలో అమృతం కోసం వాసుకి నాగరాజును కవ్వం తాడుగా ఉపయోగించారు దేవతలురాక్షకులు.శ్రీ మహావిష్ణువుకు ఆదిశేషుడు పాన్పుగా ఉంటుంది.లయ కారకుడు పరమ శివుడి కంఠాభరణంగా వాసుకిని ధరించి ప్రసిద్ధి చెందాడు.కుటుంబ సంక్షేమం కోసం నాగులచవితి కఠిన ఉపవాసాలు ఆచరించి నాగ దేవతలను ప్రసన్నం చేసుకుంటారు.దానివల్ల నాగదేవతల వల్ల కలిగిన దోషాలు కొంతైనా తగ్గుతాయని నమ్ముతారు.

పూజా విధానం..సంప్రదాయాలు

రాష్ట్రంలోని పల్లెలు,పట్టణాల్లో నాగుల చవితి వేడుకలు కన్నులపండువగా జరుగుతాయి. భక్తులు తెల్లవారుజామునే తలస్నానం చేసి,నూతన వస్త్రాలు ధరించి సమీపంలోని నాగపుట్టల వద్దకు వెళతారు.పుట్టకు పసుపు, కుంకుమ రాసి,పూలతో అలంకరించి,ఆవు పాలు,కోడి గుడ్లు సమర్పిస్తారు.ఈ పండుగకు ప్రత్యేకంగా చలిమిడి, చిమ్మిలి (నువ్వులు,బెల్లంతో చేసే పిండివంట),వడపప్పు, అరటిపండ్లు,కందగడ్డలు నైవేద్యంగా పెడతారు.

శాస్త్రీయ...పర్యావరణ కోణం...

నాగుల చవితి వెనుక కేవలం భక్తి మాత్రమే కాకుండా గొప్ప పర్యావరణ స్పృహ కూడా దాగి ఉంది.వర్షాకాలం ముగిసి చలికాలం మొదలయ్యే కార్తీక మాసంలో పాములు పుట్టల్లోకి చేరుతాయి. రైతులకు పంటలను నాశనం చేసే ఎలుకల బెడద నుండి పాములు కాపాడతాయి కాబట్టి, వాటిని 'రైతు నేస్తాలు'గా భావించి రక్షించుకోవాలనే సందేశాన్ని ఈ పండుగ ఇస్తుంది.అలాగే పుట్టమన్ను చెవులకు, కళ్ళకు రాసుకోవడం వల్ల చర్మ, నేత్ర సంబంధిత వ్యాధులు తగ్గుతాయని పెద్దల నమ్మకం.నాగుల చవితి అనేది భక్తి, ప్రకృతి ప్రేమ, కుటుంబ అనుబంధాల కలయిక. సర్ప దోషాల నుండి విముక్తి కలిగి, సకల శుభాలు కలగాలని కోరుకుంటూ భక్తులంతా ఈ పండుగను అత్యంత ఘనంగా జరుపుకుంటారు.



అరుకాల రాధిక సాగర్,
హరి:ఓం సెలక్షన్స్ (సాగర్),
ఓదెల,పెద్దపల్లి.

-పెద్దపల్లి బ్యూరో, తెలంగాణ చౌరస్తా

చేనేత రంగానికి ఆడెపు
ఉపేందర్ సేవలు చిరస్మరణీయం

- చేనేత ఆత్మబంధువుకు ఏఎంసీ మాజీ చైర్మన్ ఝాన్సీరాణి నివాళి,

కమలాపూర్,తెలంగాణ చౌరస్తా:



కమలాపూర్,మండల కాంగ్రెస్ పార్టీ తొలి అధ్యక్షుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు ఆడెపు ఉపేందర్ అనారోగ్యంతో గురువారం సాయంత్రం మృతి చెందారు.ఆయన భౌతికకాయాన్ని ఏఎంసీ మాజీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.మండలాల వ్యవస్థ ఏర్పడిన అనంతరం కమలాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ తొలి అధ్యక్షుడిగా ఉపేందర్ బాధ్యతలు నిర్వహించారు. 1987లో జరిగిన తొలి మండల పరిషత్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీపీ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. కమలాపూర్ చేనేత సహకార సంఘం అధ్యక్షుడిగా దాదాపు 20 ఏళ్లపాటు సేవలందించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆప్కో డైరెక్టర్గా కూడా పనిచేశారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకుడు, మండల అధ్యక్షుడు బొప్ప శివశంకర్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ఆడెపు విజయ తదితరులు పాల్గొని ఉపేందర్కు నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



గిరిజన విద్యుత్ ఉద్యోగుల
సంఘానికి భవన యోగం

- సొంత భవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలని కలెక్టర్కు వినతి
- సానుకూలంగా స్పందించిన హన్మకొండ కలెక్టర్ చాహత్ బాజ్పాయ్

హన్మకొండ తెలంగాణ చౌరస్తా:

గిరిజన విద్యుత్ ఉద్యోగుల సంఘానికి సొంత భవనం నిర్మించుకునేందుకు ప్రభుత్వ స్థలం కేటాయించాలని సంఘం నాయకులు హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్ను కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్లో కలెక్టర్ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే వివిధ కార్యక్రమాలు, ఉద్యోగుల సమావేశాలు, ఇతర కార్యకలాపాలకు సొంత భవనం ఎంతో అవసరమని వివరించారు. ప్రస్తుతం ఎదురవుతున్న స్థల, వసతి సమస్యలను పరిష్కరించేందుకు భవన నిర్మాణానికి అనువైన ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఉద్యోగుల అభ్యర్థనపై కలెక్టర్ చాహత్ బాజ్పాయ్ సానుకూలంగా స్పందించడంతో సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. స్థల కేటాయింపునకు సంబంధించి సానుకూల నిర్ణయం తీసుకుంటారనే ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నందా రాథోడ్, కంపెనీ గౌరవ అధ్యక్షుడు వాలు నాయక్, కంపెనీ జనరల్ సెక్రటరీ అజ్మీరా శ్రీరామ్ నాయక్, తారాచంద్ తదితరులు పాల్గొన్నారు.





పేదింట పెన్షన్ వెలుగులు

- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆర్థిక భరోసా
- అశ్వారావుపేట నియోజకవర్గంలో 4,900 మందికి కొత్తగా పెన్షన్లు మంజూరు
- అశ్వారావుపేట మున్సిపాలిటీ, మండల పరిధిలోనే వెయ్యి మందికి లబ్ధి
- ఈ నెల 19న ఖాతాల్లో నగదు జమ

అశ్వారావుపేట,తెలంగాణ చౌరస్తా:

అర్హులైన పేదలకు సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పెన్షన్లు మంజూరు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4.5 లక్షల మందికి కొత్తగా పెన్షన్లు మంజూరు చేయగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గంలో 4,900 మంది లబ్ధిదారులకు అవకాశం లభించింది. దీంతో పెన్షన్ కోసం ఎదురుచూస్తున్న నిరుపేద కుటుంబాల్లో ఆనందం వ్యక్తమవుతోంది.ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒంటరి మహిళలు, వితంతువులకు ప్రాధాన్యతనిస్తూ ఈ పెన్షన్లను మంజూరు చేసింది. కుటుంబ పోషణ భారాన్ని ఒంటరిగా మోస్తున్న మహిళలు, భర్తను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వితంతువులకు ఈ నిర్ణయం ఎంతో ఊరటనివ్వనుంది.అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలో మొత్తం 4,900 మందికి కొత్తగా పెన్షన్లు మంజూరు కాగా, అశ్వారావుపేట మున్సిపాలిటీ, మండల పరిధిలోనే సుమారు 1,000 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఈ నెల 19వ తేదీన కొత్తగా ఎంపికైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో పెన్షన్ నగదు జమ కానుంది. స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆధ్వర్యంలో అశ్వారావుపేట నియోజకవర్గంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు.ప్రతినెలా అందే పెన్షన్ నగదు వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళల రోజువారీ అవసరాలకు ఆర్థికంగా తోడ్పడనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. నియోజకవర్గంలో 4,900 మందికి కొత్తగా పెన్షన్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట మున్సిపల్ చైర్మన్ జూపల్లి శశికళ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు వదిలి మారండి.. లేదంటే కఠిన చర్యలే

- అశ్వారావుపేటలో గంజాయి, అసాంఘిక కార్యకలాపాలపై పోలీసుల నిఘా
- ప్రతి నెలా నాలుగైదు గ్రామాల్లో కార్డెన్ సెర్చ్లు
- ఎస్హెచ్ఓ సాయికిశోర్ రెడ్డి హెచ్చరిక

అశ్వారావుపేట, తెలంగాణ చౌరస్తా :



మండలంలో గంజాయి విక్రయాలు, రవాణాతో పాటు కోడిపందాలు, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ సాయికిశోర్ రెడ్డి హెచ్చరించారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.మండల పరిధిలో గంజాయి, ఇతర అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.గత ఏడాది కాలంలో నమోదైన గంజాయి కేసుల్లో సుమారు 20 మందిని అరెస్టు చేసి జైలుకు పంపినట్లు వెల్లడించారు.అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు ఇకపై ప్రతి నెలా మండలంలోని నాలుగైదు గ్రామాల్లో విస్తృతంగా కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. గంజాయి రవాణా చేసినా, విక్రయించినా, జూదాలకు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి మార్గంలో నడవాలని సూచించారు. తమ పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా అసాంఘిక కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని ఎస్హెచ్ఓ సాయికిశోర్ రెడ్డి కోరారు.

మాజీ గవర్నర్ బండారు
దత్తాత్రేయకు ఆహ్వాన పత్రిక అందజేత

- మనవరాళ్ల నూతన వస్త్రాలంకరణ వేడుకకు రావాలని ఆహ్వానం

శేరిలింగంపల్లి తెలంగాణ చౌరస్తా:



మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయను బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు చింతకింది గోవర్ధన్ గౌడ్, జిల్లా పరిషత్ చైర్మన్ నందకుమార్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన నివాసానికి వెళ్లి, ఆయన మనవరాళ్లు ఆరుషి పుట్టా, ఆబన పుట్టా నూతన వస్త్రాలంకరణ వేడుకకు సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ వేడుకకు కుటుంబ సమేతంగా విచ్చేసి చిన్నారులను ఆశీర్వదించాలని బండారు దత్తాత్రేయను ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చిన్నారులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి భవిష్యత్తు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.





కొత్తగూడెంలో ఘనంగా మేధావుల సదస్సు

- ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ సీనియర్ నాయకుడు పమ్మిడి లక్ష్మణరావు
- జిల్లా సమగ్రాభివృద్ధి, ప్రజా సమస్యలపై విస్తృత చర్చ
- కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు

అశ్వారావుపేట,తెలంగాణ చౌరస్తా:



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమగ్రాభివృద్ధి, ప్రజా సమస్యలు, సమకాలీన రాజకీయ పరిస్థితులపై చర్చించేందుకు కొత్తగూడెం పట్టణంలో శుక్రవారం మేధావుల సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అశ్వారావుపేట నియోజకవర్గానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు పమ్మిడి లక్ష్మణరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన మేధావులు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలతో ఆయన ముఖాముఖి సమావేశమై ప్రాంతీయ అభివృద్ధి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, జిల్లాలో అభివృద్ధి అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. సదస్సును ఉద్దేశించి పమ్మిడి లక్ష్మణరావు మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో, ప్రజాస్వామ్య పరిరక్షణలో మేధావుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే మేధావుల విలువైన సలహాలు, సూచనలు అవసరమని పేర్కొన్నారు.
కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరువ చేయడంలో మేధావులు, విద్యావంతులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అభివృద్ధి కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రముఖులు, వివిధ రంగాలకు చెందిన మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దీపం వెలిగిస్తుండగా
ప్రమాదవశాత్తు మంటలు.. మహిళ మృతి

- నాలుగు రోజుల పాటు మృత్యువుతో పోరాడి కన్నుమూత
- నల్లగండ్లలో విషాద ఘటన.. కుటుంబంలో తీవ్ర విషాదం

శేరిలింగంపల్లి,తెలంగాణ చౌరస్తా:



దీపం వెలిగిస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు అంటుకోవడంతో తీవ్రంగా గాయపడిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందారు. నాలుగు రోజుల పాటు మృత్యువుతో పోరాడిన ఆమె శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఈ విషాద ఘటన నల్లగండ్లలో చోటుచేసుకుంది.నల్లగండ్లలోని త్రిశాల సాఫ్రాన్ నివాసి బి. లక్ష్మి (55) ఈ నెల 9న సాయంత్రం ఇంటి కారిడార్లో దీపం వెలిగిస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. దీంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారు. ఆమె కేకలు విన్న కుమార్తె హరి చందన, పొరుగువారు వెంటనే స్పందించి మంటలను ఆర్పి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.తొలుత సిటిజన్స్ ఆసుపత్రిలో చికిత్స అందించగా, పరిస్థితి తీవ్రంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బంజారాహిల్స్లోని కేర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించినప్పటికీ నాలుగు రోజుల పాటు మృత్యువుతో పోరాడిన లక్ష్మి నవంబర్ 13న కన్నుమూశారు.మృతురాలు మ్యూజిక్ లెక్చరర్గా పనిచేస్తున్నారు. ఆమెకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.లక్ష్మి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతుండగా, స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి.



కార్తీకమాస నాగుల చవితి వేడుకలు

- జిల్లావ్యాప్తంగా భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- భక్తిశ్రద్ధలతో మహిళల ప్రత్యేక పూజలు.. నాగదేవతకు పలు రకాల అభిషేకాలు

పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా :

కార్తీక మాసం నాగుల చవితి వేడుకను పురస్కరించుకొని పెద్దపల్లి జిల్లావ్యాప్తంగా శుక్రవారం తెల్లవారుజామున నుంచే మహిళలు, భక్తులతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు, మహిళలు భక్తిశ్రద్ధలతో పుట్టలో పాలు పోసి నాగదేవతను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయం ఆవరణలో కొలువుదీరిన నాగదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చి నాగదేవతకు పూలు, పాలు, పండ్లు సమర్పించారు. నాగుల చవితి వేడుకలు జిల్లావ్యాప్తంగా మహిళలు ఘనంగా నిర్వహించారు.

ఘనంగా నాగుల చవితి వేడుకలు

కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:



కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని జాఫర్ ఖాన్ పేట్ గ్రామంలో నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని నాగదేవత ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు,హోమం నిర్వహించారు.నాగదేవత ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలు,సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాదగిరి జ్యోత్స్న శ్రీనివాస్,ఉపసర్పంచ్ శ్రావణి శ్రవణ్,గ్రామ కార్యదర్శి శంకర్ పాల్గొని నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.పెద్దపల్లి జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు,మహిళలు తరలివచ్చి నాగదేవతను దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలి

- శాలిగౌరారం మండలంలో 1,016 మందికి నూతన పింఛన్లు మంజూరు
- వేముల గోపీనాథ్, తుంగతుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి

శాలిగౌరారం, తెలంగాణ చౌరస్తా:



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు నూతన పింఛన్లు మంజూరు చేసి అర్హులైన లబ్ధిదారులకు అండగా నిలిచిందని తుంగతుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేముల గోపీనాథ్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాలిగౌరారం మండల వ్యాప్తంగా నూతనంగా 1,016 మందికి రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసిందని తెలిపారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నూతన పింఛన్లు, రేషన్ కార్డులు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం జరిగిందని ఆయన విమర్శించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని, సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అండగా నిలవాలని వేముల గోపీనాథ్ కోరారు.

పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్ విలీనం చేయడం మానుకోవాలి

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఉనికిని దెబ్బతీయొద్దు
- విద్యారంగ నిపుణులు,ఉపాధ్యాయ,విద్యార్థి సంఘాలతో చర్చించకుండా నిర్ణయాలు తీసుకోవద్దు
- పి డి ఎస్ యు ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కూతాటి రాణా ప్రతాప్



కరీంనగర్, తెలంగాణ చౌరస్తా:

ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్యు ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లాలోని కేంద్రంలోని స్థానిక సన్స్ వింగ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి నిరసన తెలపడం జరిగింది .ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కూతాటి రాణా ప్రతాప్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయాలనే ప్రతిపాదనలు విద్యార్థులు,అధ్యాపకులు,విద్యారంగంలో ఆందోళనకు కారణమవుతున్నాయని అన్నారు.ప్రభుత్వ పాఠశాలలు,ప్రభుత్వ జూనియర్ కళాశాలలు తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయడం వల్ల ఎదురయ్యే పరిణామాలపై సమగ్ర అధ్యయనం చేయకుండా ప్రభుత్వం ముందుకు వెళ్లడం సరైంది కాదన్నారు.జాతీయ విద్యా విధానం (నాప్ 2020) పేరుతో దేశవ్యాప్తంగా విద్యారంగంలో తీసుకొస్తున్న మార్పులు ప్రభుత్వ విద్యావ్యవస్థను క్రమంగా కేంద్రీకరించి,ప్రైవేటీకరణకు అనుకూలంగా మార్చే ప్రమాదం ఉందన్నారు.ఇంటర్మీడియట్ విద్య అనేది విద్యార్థుల ఉన్నత విద్యకు పునాది అని,పదో తరగతి తర్వాత విద్యార్థులు తమ ఆసక్తి, సామర్థ్యాలకు అనుగుణంగా ఎంపీసీ,బైపీసీ, సీఈసీ,హెచ్ ఈసీ వంటి గ్రూపులను ఎంచుకొని ఉన్నత విద్య వైపు అడుగులు వేస్తారని,ఈ విద్యా దశకు అవసరమైన ప్రత్యేక బోధనా వ్యవస్థ,ప్రయోగశాలలు, అధ్యాపకులు,విద్యా వాతావరణాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అన్నారు.ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేసే ప్రతిపాదనలపై విద్యార్థి సంఘాలు,ఉపాధ్యాయ సంఘాలు,అధ్యాపక సంఘాలు, విద్యారంగ నిపుణులతో విస్తృత స్థాయి చర్చలు జరపకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని,ప్రభుత్వ జూనియర్ కళాశాలల స్వతంత్ర ఉనికిని కాపాడాలని,ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక,బోధనేతర పోస్టులను వెంటనే భర్తీ చేయాలని,అన్ని కళాశాలల్లో మౌలిక సదుపాయాలు,ప్రయోగశాలలు,గ్రంథాలయాలు,తరగతి గదులు,అభివృద్ధి చేయాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ జూనియర్ కళాశాలలను బలోపేతం చేయాలని ,ఇంటర్మీడియట్ విద్యను కాపాడాలని లేనియెడల పిడిఎస్యు ఆధ్వర్యంలో విద్యార్థులను కలుపుకుని ఉద్యమిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా అధ్యక్షుడు లోకిని రమేష్,జిల్లా ఉపాధ్యక్షుడు అంగడి దేవేందర్,జిల్లా నాయకులు వెంకటేష్,నవీన్,కార్తీక్ పాల్గొన్నారు.

వడ్ల కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- రైతులకు పూర్తిస్థాయి మద్దతు ధర అందించాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజగోపాల్ గౌడ్



అబ్దుల్లాపూర్‌మెట్ తెలంగాణ చౌరస్తా:

వడ్ల కొనుగోళ్ల ప్రక్రియను తక్షణమే వేగవంతం చేసి రైతులకు ప్రభుత్వం ప్రకటించిన పూర్తి మద్దతు ధరను అందించాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా రూరల్ అధ్యక్షుడు పంతంగి రాజగోపాల్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొనుగోళ్లలో జాప్యం కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.శుక్రవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని పలు ఐకేపీ వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆయన బీజేపీ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో కల్పించిన వసతులను పరిశీలించడంతో పాటు, ధాన్యం విక్రయానికి వస్తున్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం పంతంగి రాజగోపాల్ గౌడ్ మాట్లాడుతూ.. కొనుగోళ్ల ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి ధాన్యం తూకం, కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను ఎలాంటి కోతలు లేకుండా రైతులకు చెల్లించి అన్నదాతలకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు గూడెపు మధు గౌడ్, డివిజన్ అధ్యక్షులు, బీజేవైఎం నాయకుడు చెవుల శ్రీహరి, స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీలకు
హరిపిరాల విద్యార్థులు ఎంపిక

తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:

తొర్రూరు మండలం హరిపిరాల హైస్కూల్ లో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు గ్రూప్ ఏ లో వై. యశ్వంత్ గ్రూపు బి లో సిహెచ్ ప్రవీణ్ లు రాష్ట్ర స్థాయి చిత్రలేఖన పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం బి. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో గ్రామ సర్పంచ్ చెంచర్ల స్వాతి రాజు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఎంపికైన విద్యార్థులను, డ్రాయింగ్ మాస్టర్ నిమ్మల రవి లను ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇటీవల ఎన్ టి పి సి వారు " సేవ్ ద పవర్ ఫ్యూచర్ జనరేషన్" అంశంపై నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో సుమారు 1300 పాఠశాలల నుండి 5200 పెయింటింగ్స్ పోటీ పడగా ఇందులో నుండి 50 బెస్ట్ పెయింటింగ్స్ ను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయగా తమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించడం గర్వకారణం అన్నారు.ఈనెల 18న హైదరాబాద్ లో నిర్వహించే రాష్ట్ర స్థాయిలో పోటీల్లో ప్రతిభ చూపించి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సుధాకరా చారి, మధుకర్ రెడ్డి రాజేశ్వర్ సంపత్ సంపత్ కుమార్ ఆంజనేయులు కోటేశ్వర్ రాజు గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ విధులు నిర్వహించిన ఉద్యోగులకు తక్షణమే పారితోషికం చెల్లించాలి

- ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.
- బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- సీపీఎం నేత ఏర్పుల నరసింహ



అబ్దుల్లాపూర్‌మెట్ తెలంగాణ చౌరస్తా:

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా విధులు నిర్వహించిన క్షేత్రస్థాయి సిబ్బందికి ప్రభుత్వం తక్షణమే పారితోషికం చెల్లించాలని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏర్పుల నరసింహ డిమాండ్ చేశారు. నెలల తరబడి విధులు నిర్వహించినప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వం వారికి ఎలాంటి పారితోషికం చెల్లించకపోవడం విచారకరమని విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలో సుమారు 200 మందికి పైగా ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), గ్రామ పంచాయతీ అధికారులు జూన్ 29 నుంచి అక్టోబర్ 14 వరకు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ఓటర్ల జాబితా సవరణ విధులు నిర్వహించారని తెలిపారు.అదనపు పనిభారంతో కూడిన ఈ విధులకు పారితోషికం చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ, నెలలు గడుస్తున్నా నేటికీ నిధులు విడుదల చేయలేదని ఆరోపించారు. ఉద్యోగులతో పని చేయించుకుని, వారికి రావాల్సిన పారితోషికాన్ని చెల్లించకపోవడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి ఎస్ఐఆర్ విధుల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ రావాల్సిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో బాధిత ఉద్యోగులు, కార్మికులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు చేపడతామని ఏర్పుల నరసింహ హెచ్చరించారు.



భూ రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి



- రైతులు తమ భూముల వద్ద అందుబాటులో ఉండి సర్వేకు సహకరించాలి: తహసీల్దార్ శ్రీనివాస్

నూతనకల్ తెలంగాణ చౌరస్తా

మండలంలోని దిర్శనపల్లి గ్రామంలో చేపట్టిన భూ రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు మండల తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం సర్వేయర్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లతో కలిసి గ్రామంలో జరుగుతున్న రీ సర్వే పనులను ఆయన పరిశీలించారు. సర్వే ప్రక్రియను నిర్దేశిత సమయంలో పూర్తి చేసేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.దిర్శనపల్లి గ్రామంలో మొత్తం 1,243.33 ఎకరాల భూమి ఉండగా, ఇప్పటి వరకు 570.05 ఎకరాల్లో సర్వే పూర్తయిందని, మరో 673 ఎకరాల మేర సర్వే చేయాల్సి ఉందని అధికారులు వెల్లడించారు. భూదాన్ భూములు, ప్రభుత్వ భూములు, ఆబాదీ, సాగునీటి వనరులు, జాతీయ రహదారి, ఎస్ఆర్ఎస్పీ పరిధిలోని భూముల సర్వే పూర్తయినట్లు తెలిపారు. గుండ్ల సింగారం, మేడిగూడ గ్రామాల్లో కూడా రీ సర్వే ప్రక్రియ పూర్తయిందని, తదుపరి భూభారతి చట్టం ప్రకారం భూ రికార్డుల్లో అవసరమైన సవరణలు చేపట్టాల్సి ఉందని పేర్కొన్నారు. సర్వే సమయంలో రైతులందరూ తమ భూముల వద్ద అందుబాటులో ఉండి, తమ ఆధీనంలోని భూములను సరైన హద్దులతో సర్వేయర్లకు చూపించాలని తహసీల్దార్ కోరారు. భవిష్యత్తులో భూ సంబంధిత సమస్యలు తలెత్తకుండా రీ సర్వే ప్రక్రియకు రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

22 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

మరోవైపు మండలంలోని 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఇప్పటివరకు సుమారు 40 ధాన్యం రాశులు చేరుకున్నాయని అధికారులు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఐకేపీ సిబ్బంది అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసుకొని కొనుగోలుకు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.





శాస్త్రీయ దృక్పథంతో.. యువతలో ప్రశ్నించే తత్వం పెరగాలి

- నిరుద్యోగం, యువజన వ్యతిరేక విధానాలపై గళమెత్తాలి
- పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ

నూతనకల్ , తెలంగాణ చౌరస్తా :

యువత శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని, సమాజంలో చోటుచేసుకుంటున్న అసమానతలు, ప్రభుత్వాలు అనుసరిస్తున్న యువజన వ్యతిరేక విధానాలపై ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకోవాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు.శుక్రవారం నూతనకల్ మండల కేంద్రంలోని సాయిరాం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పీవైఎల్ సూర్యాపేట జిల్లా 9వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కోలా లక్ష్మీనారాయణ,మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డేవిడ్ కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు యువతను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయని విమర్శించారు. యువతను మద్యం, మత్తు పదార్థాలకు బానిసలుగా మారుస్తూ వారిలో ప్రశ్నించే ఆలోచనా శక్తిని దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం, యువత అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనపై ప్రభుత్వాలు తగిన శ్రద్ధ చూపడం లేదని అన్నారు. యువత వ్యక్తిగత ప్రయోజనాలకే పరిమితం కాకుండా దేశ భవిష్యత్తు, సమాజ అభివృద్ధిపై ఆలోచించాలని సూచించారు. సమాజంలో నెలకొన్న అసమానతలు, ప్రజా సమస్యలపై అవగాహన పెంచుకొని చైతన్యవంతంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగులు, యువజనులు ఐక్యంగా ఉద్యమించి తమ హక్కులను సాధించుకోవాలని కోరారు.మహాసభ ప్రారంభానికి ముందు పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్గొండ నాగయ్య సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పిస్తూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. రవి సంతాప తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. మహాసభకు మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డేవిడ్ కుమార్ ప్రారంభోపన్యాసం చేశారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉదయగిరి, పీవైఎల్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కునుకుంట్ల సైదులు, దేశోజు మధు, జిల్లా ప్రధాన కార్యదర్శి డి. రవి, నాయకులు వీర బోయిన రమేష్, బండి రవి, బ్రహ్మం, గిరిబాబు, మున్నా అశోక్, అనంతరామయ్య, కిరణ్, దండి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధికి నగర్ డ్రైనేజీ సమస్యకు రూ.1.20 కోట్ల నిధులు మంజూరు

- ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి స్థానికుల కృతజ్ఞతలు
- వెంటనే టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించాలి
- ఆంజనేయులు సాగర్

శేరిలింగంపల్లి, తెలంగాణ చౌరస్తా:

శేరిలింగంపల్లి నియోజకవర్గం అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని సిద్ధికి నగర్ కాలనీలో దీర్ఘకాలంగా నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి రూ.1.20 కోట్ల నిధులు మంజూరు కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి కాలనీ వాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కాలనీలో డ్రైనేజీ సమస్యతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నిధుల మంజూరుకు ఎమ్మెల్యే కృషి చేశారు. ఈ క్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ అధికారులు జనరల్ మేనేజర్ హరిశంకర్, డీజీఎం నరేందర్ రెడ్డి, మేనేజర్ విక్రమ్ రెడ్డి కీలకంగా స్పందించి నిధుల మంజూరుకు సహకరించారు.ఈ సందర్భంగా ఆంజనేయులు సాగర్ మాట్లాడుతూ.. కాలనీ ప్రజల సమస్యపై వెంటనే స్పందించి రూ.1.20 కోట్ల నిధులు మంజూరు చేయించడంలో చొరవ చూపిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి, సహకరించిన హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.నిధులు మంజూరైన నేపథ్యంలో ఇకపై ఆలస్యం చేయకుండా టెండర్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించాలని కోరారు. సమస్యకు పరిష్కారం లభించనున్న నేపథ్యంలో సిద్ధికి నగర్ కాలనీ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ వేముల వీరేశం కుటుంబం

- నకిరేకల్ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారికి ప్రత్యేక ప్రార్థనలు

రామన్నపేట, తెలంగాణ చౌరస్తా:

ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నకిరేకల్ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని శ్రీవారిని వేడుకున్నారు.అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యే వేముల వీరేశం, ఆయన కుటుంబ సభ్యులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందించారు.





నాగుల చవితి వేడుకలలో మాజీ జడ్పీటీసీ

కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని జాఫర్ ఖాన్ పేట్ గ్రామంలో నాగుల చవితి పర్వదినం సందర్భంగా నాగుల చవితి ఉత్సవాలలో తాజా మాజీ జడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మండల ప్రజలందరూ ఎల్లప్పుడూ సుభిక్షంగా ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని నాగదేవత అమ్మవారిని కోరుకున్నట్టు తెలిపారు.ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దొమ్మటి రజిత శ్రీనివాస్,సంగ కొమురయ్య,గట్టయ్య,చంద్రయ్య,వార్డు మెంబర్ బోడకుంట్ల అజయ్ కుమార్,తోట రవి,కారుకూరి సుధాకర్,మండల బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు కుంభం రాజు ముదిరాజ్,భక్తులు,గ్రామ ప్రజలు,పాల్గొన్నారు.

